క్లుప్తంగా

బంగారమ్మ తల్లికి నైవేద్య పూజలు



అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో వంశధార నదీతీరంలో కొలువైన బంగారమ్మ తల్లికి భక్తులు రకరకాల పండ్లు, వంటకాలతో శుక్రవారం నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. బంగారమ్మ తల్లి పెద్ద పండుగ సందర్భంగా ఈనెల 28వ తేదీ వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు వివరించారు. అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర గాయత్రి యజ్ఞం



యజ్ఞం చేస్తున్న దృశ్యం

సారవకోట: కిన్నెరవాడ గ్రామంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో వైశాఖ మాస దశమిని పురస్కరించుకుని 11వ నవ కుండలి గాయత్రి యజ్ఞాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక, విశేష పూజలు, అభిషేకాలు, గోమాత పూజ నిర్వహించారు. అనంతరం కంచుమోజు రామమోహనరావు, శంభాన హేమసుందర ఆచార్యులు సమక్షంలో గాయత్రి యజ్ఞం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

41 బూత్‌లలో మహిళల ఓటింగ్ అధికం

సారవకోట: మండలంలో ఈ నెల 13న జరిగిన సాధారణ ఎన్నికల్లో 64 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. వీటిలో 41 బూత్‌లలో మహిళా ఓటింగ్ అధికంగా ఉంది. 35,614 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా వీరిలో 17,807 మంది మహిళలు, 17,408 మంది పురుషులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ధర్మలక్ష్మీపురం బూత్‌లో పురుషుల కంటే మహిళలు 112 ఓట్లు ఎక్కువ ఓట్లు వేశారు. అలాగే పెద్దలంబలో కూడా 90 మంది మహిళలు ఎక్కువగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు



ఆరాధన కార్యక్రమం నిర్వహిస్తున్న భక్తులు

బూర్జ: మండలంలోని ఏపీపేట పంచాయతీ కేకే రాజపురం (కురింపేట) గ్రామంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి అన్న సమాధి ఆరాధన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈది సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కటకం రాజేశ్వరరావు, ర్యాలీ శ్రీను, మురళి, పెడగడ అప్పలాచారి, రవీంద్ర ఆచారి, శ్రీనివాసరావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



కర్లెమ్మ బాపన కర్ర చెరువు పనులు పరిశీలిస్తున్న దృశ్యం

కొత్తూరు: ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం ఉపాధి వేతనదారులు చేయాలని ఎంపీడీవో త్రివిక్రమరావు అన్నారు. నిబంధనల మేరకు పనులు చేస్తే రోజుకు రూ. 300 వేతనం గిట్టుబాటు అవుతోందన్నారు. మండలంలోని హసింగిలోని ముల్లివాని చెరువు, కర్లెమ్మ గ్రామంలోని బాపన కర్ర చెరువుల్లో జరుగుతున్న పనులను శుక్రవారం పరిశీలించారు. తొలుత వేతనదారుల మస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. తప్పుడు మస్టర్లు వేయవద్దని సిబ్బందికి సూచించారు.

ప్రత్యేక అలంకరణలో త్రిపురసుందరీదేవి

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి నదీ తీరాన ఉన్న బాల త్రిపుర కాలభైవర పీఠం దేవాలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు.

'పేట' పోరులో పోలా'కీ'లకం!

- ప్రధాన పోటీదారులు ఈ మండల వాసులే..
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కృష్ణదాస్‌కు అనుకూలం

పోలాకి:

సార్వత్రిక ఎన్నికల్లో నరసన్నపేట నియోజకవర్గంలో ప్రధాన పోటీదారులుగా ఉన్న వైఎస్సార్‌సీపీ, కూటమి అభ్యర్థుల సొంత మండలం పోలాకి. దీంతో అందరి దృష్టి ఇప్పుడు దీనిపై పడింది. ఈ మండలం ఓటర్లు ఎవరికి జైకొడితే వారే విజేతలుగా గతంలో నిలుస్తూ వచ్చారు. గతంలో బగ్గు రమణమూర్తి గెలుపునకు మండల ఓటర్లే కారణంగా చెప్పకతప్పదు. ఈసారి కూడా అలాంటి ఎత్తుగడే వేసినప్పటికీ ఆ పరిస్థితులు కన్పించటం లేదు. మూడేళ్ల క్రితమే ఈ పరిస్థితిని ధర్మాన కృష్ణదాస్ వర్గం పసిగట్టింది. దీంతో ఆయాచోట్ల ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేసుకున్నారు. ఇక్కడ నుంచి మాజీ ఎమ్మెల్యే కేఎస్‌ఏ భుక్త, డోల జగన్, తమ్మినేని భూషణరావులు గతంలో బగ్గుతో నడిచి గెలిపించిన మాట ఎంత నిజమో..అదే నాయకుల వెనుకప్రజలు అప్పటిలా ఇప్పుడు వెళ్లలేదన్నది కూడా అంతేనిజం. మండలంలో 71 పోలింగ్ బూత్‌లలో 54,431 ఓటర్లు ఉండగా.. అందులో 81 శాతం ఓటింగ్ జరిగింది.

క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీకి పెరిగిన బలం

పోలాకి మండలంలో 2019 ఎన్నికలతో పోల్చుకుంటే క్షేత్రస్థాయిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు మరింత బలంపెరిగింది. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ కుమారుడు కృష్ణచైతన్య ఇక్కడ నుంచే జెడ్పీటీసీ సభ్యుడుగా పోటీచేసి అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. 19 ఎంపీటీసీ స్థానాలకు 15 మంది సభ్యులు, 31 పంచాయతీల్లో 29 చోట్ల ఎన్నికలు జరిగితే 25 మంది సర్పంచ్‌లు సైతం వైఎస్సార్‌సీపీకి చెందినవాళ్లే విజయం సాధించారు. ఇక ప్రధానంగా ఆధిపత్యం చూపించే వెలమ, కాపు, శ్రీశైన, మత్స్యకార, కాళింగ, యాదవ సామాజికవర్గాలతో పాటు బలహీనవర్గాల సపోర్టుసైతం కృష్ణదాస్‌కే ఉంది. కాళింగుల నుంచి తమ్మినేని భూషణరావు పార్టీ మారితే అదే సుసరాం గ్రామంలో కళింగ కురువృద్ధుడు, ఏఎంసీ చైర్మన్ దుంపల భాస్కరరావు కుమారుడు ప్రముఖ వైద్యుడు హరిప్రసాద్ గట్టిగా నిలబడి సుసరాంతో పాటు మండలంలోని పలు కళింగ గ్రామాల్లో పార్టీకి వెన్నుదన్నుగా నిలిచారు. దీంతోపాటు ఎంపీ పేరాడ తిలక్ అభ్యర్థిత్వం సైతం ఇక్కడ ప్రభావితం చేసింది. కాపు నాయకుడు డోల జగన్ పార్టీ మారినా అంతనష్టం ఏమీ లేదని, ఆయన వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి ఎప్పుడూ పార్టీకి మద్దతుగా లేరని ఇక్కడ ఓటర్లు గుర్తుచేస్తున్నారు. దీంతో పాటు పోలాకి మండలంలో మూడుసార్లు ఎంపీపీగా, జెడ్పీటీసీగా పనిచేసి, ప్రతిగ్రామంలో పట్టున్న నాయకుడు డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు వైఎస్సార్‌సీపీకి గట్టిగానే 'కాపు'కాశారు. ఇక భుక్తగారి రాజకీయానికి కాలం చెల్లిందన్న సంగతి గతంలోనే ప్రియాగ్రహారం ప్రజలే స్థానిక ఎన్నికల్లో తేల్చేశారు. మత్స్యకార గ్రామా ల్లో టీడీపీ కంచుకోట కొత్తరేవులో పరిస్థితులు మారాయి. అదే త్రోవలో అంపలాం, గుల్లవానిపేట, గుప్పెడుపేట పంచాయతీల్లో మత్స్యకారులు దాసన్నకు జైకొట్టారు. ప్రధానసామాజిక వర్గం వెల మలకు ధర్మాన ప్రసాదరావు తరువాత మళ్లీ ఇన్నాళ్లకు ఎంపీపీ పదవిని కట్టబెట్టారు కృష్ణదాస్. మండల పరిషత్ సలహాదారుగా ముద్దాడ భైరాగినాయుడు కూడా ఎన్నికల్లో బాగా కష్టపడ్డారు. యువతతోపాటు అన్నివర్గాల్లో ఆ సామాజిక వర్గంలో ఆయన తనదైనశైలిలో పార్టీని బలోపేతం చేశారు. శ్రీశైయన నుంచి కోట అప్పారావు, యాదవుల నుంచి కలగదండు తాతారావులకు వైస్ ఎంపీపీలను చేసి వైఎస్సార్‌సీపీ గౌరవించింది. దీంతో ఆయా వర్గాలల్లో సైతం సానుకూల పరిస్థితి ఉంది. సరిగ్గా ఎన్నికలకు రెండురోజుల ముందు పోలాకి మండల టీడీపీలో నెలకొన్న పరిస్థితుల కారణంగా ముగ్గురు ముఖ్యనాయకులు ఫ్యాన్‌గాలి వైపు మళ్లటం మరోముఖ్యమైన అంశాల్లో ప్రధానమైనది.



ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు(ఫైల్)



గత ఎన్నికలకు భిన్నం..

పోలాకి మండలంలో ఈసారి ఎన్నికలు గతానికి భిన్నంగా జరిగాయని చెప్పొచ్చు. 2014లో ఇదే బగ్గు రమణమూర్తి పోలాకిలో 1500 ఓట్లు అధిప త్యం సాధించగా, 2019లో కృష్ణదాస్ దాదాపు ఏడువేల మెజార్టీ సాధించారు. అప్పుడు 71 పోలింగ్ కేంద్రాల్లో కేవలం 14 చోట్ల టీడీపీకి ఆధిపత్యం కనిపించింది. అందులోనూ కొన్నిచోట్ల సింగిల్ డిజిట్‌కే పరిమితం. ఆయాచోట్ల ఒకటి రెండు చోట్ల తప్ప మిగిలిన చోట్ల సీన్ రివర్స్ అయింది. గతంలో హరిశ్చంద్రపురం నియోజకవర్గంలో ఉన్న 14 పంచాయతీల్లో ఈసారి వైఎస్సార్‌సీపీ మెరుగుపడింది. వైఎ స్సార్‌సీపీకి ఎక్కువగా మెజార్టీ వచ్చిన రాళ్లపాడు, బెలమర, ఉర్జాం, పోలాకి, ధీర్ఘాశి, చీడివలస, ఈదులవలస, మబగాం, గుప్పెడుపేట, రహిమానుపురం, బొద్దాం, పిన్నింటపేట, సుసరాం, ప్రియాగ్రహారం, సత్రవుపేట, పిరువాడ, నందిగాం తదితర బూత్‌లల్లో టీడీపీ చేసిన ఆపరేషన్ ఆస్థాయిలో వర్కఅవుట్ కాలేదు. ఏదిఏమైనా పోలాకి ప్రజలు ఫ్యాన్‌వైపే ఉన్నారని, టీడీపీ వాపుచూసి బలుపు అనుకుంటుందని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నమ్మకంగా చెబుతున్నారు.

ప్రమాదకరంగా సింగుపురం వంతెన

పాతపట్నం: మండలంలోని టిక్కలి–తెంబూరు రహదారి నుంచి సింగుపురం గ్రామానికి వెళ్లె రహదారిలో ఉన్న గుమ్మగెడ్డపై నిర్మించిన వంతెన ప్రమాదకరంగా మారింది. బెర్మ్‌లు కోతకు గురికాండంతో ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. వంతెన ఇరువైపులా రక్షణగోడలు కూలిపోయాయి. సింగిపురం, గురండి, మీదుగా ధనుపురం వరకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారి గుండా రైతులు చెరుకులు, వరిచేనును ఎడ్లబళ్లు, ట్రాక్టర్లతో తరలిస్తుంటారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి వంతెన మరమ్మతులు చేపట్టాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న వంతెన

సంతోషిమాతకు పూజలు



శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని సంతోషిమాత అమ్మవారి ఆలయంలో శుక్రవారం కుంకుమ పూజలు నిర్వహించారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ నేతృత్వంలో మూలవిరాట్టుకు పాలు, పసుపు నీళ్లతో అభిషేకాలు చేశారు. అష్టోత్తర శతనామాలతో పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అమ్మవారిని పూలతో అలంకరించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

విస్తారంగా నువ్వు పంట సాగు

ఆమదాలవలస రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో నువ్వు పంటను రైతులు సాగు చేస్తున్నారు. రామచంద్రాపురం, వెదుళ్లవలస, బొబ్బిలిపేట, దూసి, తోటాడ, తమ్మయ్యపేట, కంచరాపువానిపేట, ముద్దాడపేట, దిబ్బలపేట, కొత్తవలస తదితర గ్రామాల్లో రబీ సాగులో భాగంగా ఈ పంటను పండిస్తున్నారు. రబీలో అపరాల పంటలు ఆశించిన దిగుబడులు రావడం లేదు. దీంతో అపరాల పంటకు విరామం చెప్పి నువ్వు సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. నువ్వుల సాగులో ఆశించిన దిగుబడులు పొందగలమని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుమారు మూడు వేల ఎకరాల్లో నువ్వు పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట పూత దశలో ఉంది.



తమ్మయ్యపేటలో సాగులో ఉన్న నువ్వులచేను

ముమ్మరంగా వేసవి దుక్కులు



మునగవలసలో ట్రాక్టర్‌తో పొలాన్ని దుక్కి చేస్తున్న రైతు

ఆమదాలవలస రూరల్: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గ్రామాల్లో పొలం దుక్కులు ముమ్మరంగా రైతులు చేపడుతున్నారు. వేసవి కాలంలో పొలం దుక్కి దున్నడం వలన పంటలకు ఎంతో మేలు జరుగుతుందని రైతులు చెబుతున్నారు. వర్షాల కారణంగా ముందస్తుగానే ఖరీఫ్ పంటకు దుక్కులు చేయడం జరుగుతుందన్నారు. రామచంద్రాపురం, చిట్టివలస, సైలాడ, మునగవలస, జొన్నవలస, దూసి, కొత్తవలస, తొగరాం, చీమలవలస, గాజులకొల్లివలస గ్రామాల్లో జోరుగా ట్రాక్టర్లతో దుక్కులు చేపడుతున్నారు.

నడవడిక మార్చుకోండి

శ్రీకాకుళం క్రైమ్ :

తెలిసో తెలియక చేసిన తప్పుల కారణంగా సమాజంలో రౌడీషీటర్లుగా ముద్రపడే మీలాంటి వారంతా నడవడిక మార్చుకుంటే రౌడా షీట్లు ఎత్తివేస్తామని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ జి.ఉమామహేశ్వరరావు అన్నారు. ఎస్పీ రాధిక ఆదేశాలతో శుక్రవారం రాత్రి స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లతో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఉన్న మాదిరిగానే మిగతా సమయంలోనూ ప్రశాంతంగా కుటుంబంతో గడపాలన్నారు. కొట్లాటకు, దొమ్మీలకు వెళ్లి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పీడీ యాక్టులు నమోదు చేసి జిల్లా బహిష్కరణకు గురి చేస్తామన్నారు. సీఐతో పాటు ఎస్ఐ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ ఉమామహేశ్వరరావు

విద్యాకానుక కిట్ల పంపిణీపై సమీక్ష

హిరమండలం: రానున్న విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు విద్యాకానుక కిట్ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని ఎంఈవో రాంబాబు తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో శుక్రవారం సిబ్బందితో సమీక్షించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. విద్యాకానుకలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న బ్యాగులు, పుస్తకాలు, షూల కిట్లు ఈ స్టాక్ పాయింట్‌కు చేరుకుంటాయని చెప్పారు. ఈ పాయింట్ వద్ద ముగ్గురేసి వ్యక్తులను నియమించామన్నారు. కానుక కిట్లు వచ్చినప్పుడు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఇబ్బందులు ఎదురైతే వెంటనే సమాచారం అందించాలన్నారు. సమీక్షలో ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.



సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంఈవో రాంబాబు

ఆహార నియమాలు పాటించాలి

ఎల్.ఎన్.పేట: అధిక రక్తపోటు, సుగర్ తదితర వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ ఆహార నియమాలను పాటించాలని తురకపేట ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ నీతూ, డాక్టర్ ఎ.లక్ష్మీదీప్ అన్నారు. ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవం సందర్భంగా గ్రామంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిన్నచిన్న వ్యాధుల బారిన పడకుండా మనం తీసుకునే జాగ్రత్తలు, అహార నియమాలను మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయన్నారు. ఆరోగ్యకంగా ఉండేందుకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కలిగించారు. సూపర్‌వైజర్లు ఈశ్వరమ్మ, జనార్దనరావు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, గ్రామ యువకులు పాల్గొన్నారు.



ఎల్.ఎన్.పేట: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

నవధాన్యాల సాగుతో ప్రయోజనాలు



నవధాన్యాల కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

కొత్తూరు: వరి వెదలు వేసే పొలాల్లో నవధాన్యాలు సాగు చేయడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని కొత్తూరు వ్యవసాయ సబ్ డివిజన్ ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనీ ఎస్.సూర్యనారాయణ అన్నారు. కడుము గ్రామానికి చెందిన రైతులకు నవధాన్యాల కిట్లను సీతంపేట ఐటీడీఏ ప్రకృతి వ్యవసాయ ఎన్ఎఫ్ఏ ముసలయ్య, ఎంటీ సూర్యనారాయణ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ.. నవధాన్యాలు సాగుతో వెదలో కలుపు మొక్కలను నివారించవచ్చునన్నారు. అలాగే భూమిలో తేమను పది నుంచి 15 శాతం ఉంచడం, భూసారం పెంచుతుందన్నారు. వరి పంటకు అవసరమైన పోషక విలువలు అందిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జనార్దనరావు, కేశవ, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు 10 మంది అర్హత

శ్రీకాకుళం న్యూకాలనీ: తమ పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థినులు మహాత్మా జ్యోతిబాపూలే జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు అర్హత పొందినట్టు శ్రీకాకుళం హయాతీనగరం ఎంజేపీఏపీబీసీడబ్ల్యూ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. ఎంపికైన వారిలో ఎం.పద్మపూజిత, డి.భార్గవి, వై.జాహ్నవి, ఎల్.మనీషా, పి.చందన, పి.అపర్ణ, పి.సాయిలక్ష్మి (నెల్లిమర్ల జూనియర్ కళాశాల),జి.రంజిత (తానాం), పి.అనుశ్రీ (గుడిబండ), ఎస్.తేజేశ్వణి (ఆమదాలవలస) ఉన్నారు. వీరి ఎంపిక పట్ల ప్రిన్సిపాల్ తోపాటు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

పాడిని కాపాడుకుందాం ఇలా..

- వేసవిలో పాడిపశువుల సంరక్షణకు జాగ్రత్తలు తప్పనిసరి
- నిర్లక్ష్యం చేస్తే ఇబ్బందులు
- పశువైద్యాధికారి రమణ



వి.రమణ, పశువైద్యాధికారి

ఎచ్చెర్ల: పాడిపై ఆధారపడిన రైతులకు ప్రభుత్వం అనేక పథకాల ద్వారా ప్రోత్సాహం అందిస్తోంది. గేదెలు, ఆవులకు ప్రమాదవశాత్తూ ఏదైనా జరిగినా తక్షణమే వైద్య సాయం అవసరమైతే 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే క్షణాల్లో పశువైద్యులు అంబులెన్స్ ద్వారా అక్కడికి చేరుకుని పశువుల ప్రాణాలు కాపాడుతున్నారు. ప్రస్తుతం వేసవి తీవ్రత పెరుగుతున్న తరుణంలో పాడి రైతులు జాగ్రత్తలు పాటిస్తే పశువులను కాపాడుకోవచ్చని ఎచ్చెర్ల మండల పశువైద్యాధికారి డాక్టర్ వి.రమణ సూచించారు. చలువ పందిళ్ల కింద పశువులను ఉంచడం వల్ల ఆరోగ్యంగా ఉంటాయన్నారు. పాడి రైతులకు ఆయన అందించిన సూచనలు ఇలా..



పాకలో కట్టిన పశువులు

- పశువులకు కొట్టం ఏర్పాటు చేసుకోవాలి. పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. కొట్టంలోకి గాలి, వెలుతురు బాగా ప్రవేశించేలా ఏర్పాటు చేసుకోవాలి. పరిశుభ్రమైన చల్లని నీటిని అందుబాటులో ఉంచాలి. పచ్చని, ఎండుగడ్డి సమృద్ధిగా అందించాలి.
- సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించి అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాధులకు కారణమయ్యే గోమార్లు, దోమలు, ఈగలను నిర్మూలించాలి. గేదెల పాకలు చల్లగా ఉండేలా జాగ్రత్త పడ్డాలి. పశువుల పాక పైకప్పును గడ్డి తోకప్పి నీళ్ల చల్లుతూ ఉండాలి.
- వీలైనంత వరకూ పాక పరిసరాల్లో చల్లటి నీడనిచ్చే కానుగ, బాదం, వేపచెట్లు పెంచుకోవాలి. రోజుకు రెండు మూడు సార్లు పశువులను చల్లటి నీటితో కడగాలి. వేసవిలో ఉదయం పది గంటలోపు సాయింత్రం ఐదు గంటలపైన మాత్రమే మేత కోసం పశువులను బయటకు తోలాలి. ఎండ ఉన్న సమయంలో మేతకు బయటకు తోలకూడదు.

వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బ తగిలిన పశువుల్లో శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. చమటలు ఎక్కువగా బయటకు రావటం, దాహం అధికంగా పెరగడం, మేత సరిగా మేయక పోవడం, శ్వాస కష్టంగా ఉండటం, ఎదకు సరిగా రాకపోవడం, గర్భస్రావం వంటి సమస్యలు తలెత్తుతాయి.

చికిత్స: వడదెబ్బకు గురైన పశువులను గుర్తించి వెంటనే చికిత్స చేయించాలి. చల్లటి ప్రదేశాల్లో ఉంచి తేలికగా జీర్ణం అయ్యే దాణా, గంజిలో ఉప్పు కలిపి ఆహారంగా ఇవ్వాలి. వైద్యులను సంప్రదించి డెక్రోజ్ సైలైన్ ద్రావణాన్ని రక్తనాళంలోకి విటమిన్ ఏ, డీ సూదిమందులను విటమిన్ సీ, బీ కాంప్లెక్స్ సూది మందులను వేయించాలి. రోజుకు 40 లీటర్ల నీటిని తాగించాలి.

పచ్చిమేతే రక్షణ

వేసవిలో పశువులకు పచ్చిమేత అందించాలి. పచ్చిగడ్డి పశువుల శరీర ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది. పోషక విలువల కోసం ఖనిజ లవణ మిశ్రమం (మినరల్ మిక్సర్) వంటివి వాడాలి. పచ్చగడ్డి సదుపాయం లేని రైతులు పాతర వేసిన యూరియా గడ్డిని అందిస్తే ఫలితం ఉంటుంది. ఈ గడ్డిలో 45–55 శాతం వరకూ తేమ ఉంటుంది. శరీర ఉష్ణోగ్రత తగ్గి పాల దిగుబడి పెరిగే అవకాశం ఉంది. పశువుల పాక వద్ద పేడ, పెంటకుప్పల మీద వాలే దోమలు, ఈగల నివారణకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలి.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరండి

పొందూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు చేరాలని ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్ ఐ.మల్లేశ్వరరావు కోరారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీతో పాటు ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. తమ కళాశాల లెక్చరర్లు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి రాపాక, వాండ్రంగి, కొంచాడ, పొందూరు తదితర గ్రామాల్లో పర్యటించి పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, తల్లిదండ్రులను కలుస్తున్నామన్నారు.



రాపాకలో విద్యార్థులతో మాట్లాడుతున్న లెక్చరర్లు